క్లుప్తంగా

నేటినుంచి విశ్వకర్మ జయంత్యుత్సవాలు

నరసన్నపేట: మండల కేంద్రంలో మంగళవారం నుంచి ఆదివిరాట్ విశ్వకర్మ జయంత్యుత్సవాలు స్వర్ణకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధి తాలభక్తుల గోవిందరావు సోమవారం తెలిపారు. బండి వీధి స్వర్ణకార భవనంలో 20వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. తెలగవీధిలో విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలు 22వ తేదీ వరకు నిర్వహిస్తామని కమిటీ ప్రతినిధి వమ్మి అప్పలస్వామి తెలిపారు.

నేటినుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

హిరమండలం: ఈ నెల 17, 18వ తేదీల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించనున్నట్లు ఎంఈఓ కె.రాంబాబు తెలిపారు సోమవారం తెలిపారు. హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గులుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రైమరీ టీచర్స్‌కు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశాలు ఉంటాయన్నారు. కొత్తూరు, హిరమండలం మండలాల్లో యూపీ, హైస్కూళ్లు 50 శాతం చొప్పున సర్దుబాటు చేసుకుంటాయన్నారు. తెలుగు సబ్జెక్టుకు సంబంధించి అవలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లెక్కలు భగీరథిపురం, ఇంగ్లిష్ తంప, సోషల్ హిరమండలం, ఫిజికల్ సైన్స్ మెట్టూరు, బయాలజీ కుంటిభద్ర, హిందీ కొత్తూరు ఉన్నత పాఠశాలల్లో ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులకు సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. ప్రతీ ఉపాధ్యాయుడు సమావేశాలకు హాజరయ్యేలా ఆయా స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.50 వేల అందజేత



మంత్రి అచ్చెన్నాయుడుకు చెక్ అందిస్తున్న రాజేశ్వరి

నరసన్నపేట: మేజరు పంచాయతీ మాజీ సర్పంచ్ ఊణ్న రాజేశ్వరి కుటుంబ సభ్యులు సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.50 వేలు అందజేశారు. ఈ మేరకు చెక్‌ను మంత్రి అచ్చెన్నాయుడుకు సోమవారం అందించారు. ఊణ్న వెంకటేశ్వరరావు, ఊణ్న సత్యానందం (చిన్నబాబు) ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

పొందూరు: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కబడ్డీ యూత్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

పాతపట్నం: మండలంలోని పాశీగంగుపేట గ్రామం శివారు షెడ్ కింద జూదం ఆడుతున్న ఐదుగురుని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామని ఏఎస్ఐ అప్పారావు తెలిపారు. గ్రామ శివారులో కొందరు జూదం ఆడుతున్నట్టు పక్కా సమాచారం అందడంతో సోమవారం దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.4,640 నగదు, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

గడ్డిమందు తాగి వివాహిత మృతి



ఉంగ ధనలక్ష్మి మృతదేహం

మెళియాపుట్టి: మండలంలోని సంతలక్ష్మీపురం గ్రామానికి చెందిన వివాహిత ఉంగ ధనలక్ష్మి (25) సోమవారం ఇంటి వద్ద మృతి చెందింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతురాలు మూడు రోజుల క్రితం గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు కరజాడ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి పలాస, టెక్కలి ఆస్పత్రులకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం తీసుకెళ్లి చికిత్స అందించారు. మూడు రోజులుగా చికిత్స పొందుతున్నప్పటికీ కోలుకోకపోవడంతో బతకడం కష్టమని స్వగ్రామానికి తీసుకొచ్చారు. కాసేపటికే మృతి చెందింది. ధనలక్ష్మికి స్వగ్రామంలోనే పీతాంబరం అనే యువకునితో వివాహమైంది. నాలుగేళ్ల కుమార్తె, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. మృతురాలి భర్త వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు. చాలీచాలని కూలీతో కుటుంబపోషణ కష్టంగా ఉందని, వేరే పని చూసుకోమని నిత్యం భర్తతో గొడవకు దిగేది. ఆ సమయంలోనే ఈ నెల 14న భర్తకు బెదిరిస్తానని గడ్డి మందు తాగింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● ఇలా ఉంటే రోగాలు రావా?



ఈ చిత్రంలో కనిపిస్తున్నది హిరమండలం మేజర్ పంచాయతీ సుభలయలోని రహదారి. పలు వీధుల్లో డ్రైనేజీలు మురుగుతో నిండిపోయాయి. మరికొన్ని వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగునీరు రహదారులపై నిల్వ ఉంటుంది. దోమలు వృద్ధి చెంది జబ్బుల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్యంపై పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. - హిరమండలం

● పేరుకుపోయిన గుర్రపుడెక్క



సారవకోట మండలంలో ప్రవహిస్తున్న వంశధార ఎడమ కాలువ గుర్రపుడెక్కతో నిండి ఉంది. కిన్నెరవాడ సమీపంలో నిర్మించిన బ్రిడ్జికు అడ్డంగా గుర్రపుడెక్క నిలిచిపోవడంతో కిందకు నీరు వెళ్లడంలేదు. నీటితోపాటు గుర్రపుడెక్క కాలువల ద్వారా సమీపంలోని చెరువుల్లోకి చేరుతున్నాయి. - సారవకోట

● 90 మందికి నేత్ర పరీక్షలు



సారవకోట మండలం బుడితిలో శ్రీకాకుళం అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. 90 మందికి తనిఖీలు నిర్వహించి, 52 మందికి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు క్యాంప్ కోఆర్డినేటర్ సీహెచ్ అశ్వనీ కుమార్ తెలిపారు. ప్రభుత్వ పీఎంఓ ప్రతాప్, శంకర్ ఫౌండేషన్ వైద్యురాలు గీతాంజలి, ఆప్తాలమిక్ ఆఫీసర్ సత్యవతి పాల్గొన్నారు. - సారవకోట

పొంచి ఉన్న ప్రమాదం

- కుంగిన కల్వర్టు
- పట్టించుకోని అధికారులు



కుంగిన కల్వర్టు వద్ద రోడ్డుకు అడ్డంగా కట్టిన చిన్న గోడ

కొత్తూరు: మండలంలోని ప్రధాన రహదారుల్లో మాతల–రుగడ ఒకటి. ఈ రోడ్డు మాతల నుంచి మాకవరం, కుద్దిగాం, బంకి, రుగడ, సీది గ్రామాల మీదుగా పాతపట్నం మండలం చిలకమ్మ జంక్షన్ వద్ద పాతపట్నం మెయిన్ రోడ్డును కలుస్తుంది. ప్రతి నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ రహదారిలోని వీరనారాయణపురం సమీపంలో ఉన్న డోల బట్టిపై (సాగు నీటి కాలువ) ఉన్న కల్వర్టును గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. కొద్ది నెలల క్రితం కల్వర్టు కుంగింది. ఈ ప్రాంతం వద్ద హెచ్చరిక బోర్డులు లేవు. ఈ ప్రాంతానికి కొత్తగా వచ్చినవారు ప్రమాదాలకు గురవుతున్నారు. కుంగిన కల్వర్టుకు ముందు రోడ్డులో మలుపు ఉన్నందున వాహనాన్ని అదుపు చేయలేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో మండలంలోని పొనుటూరుకు చెందిన ఓ యువకుడు బైక్ ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితినుంచి బయటపడ్డాడు. కల్వర్టుకు వెనుక బలిజవాని గెడ్డపై నిర్మించిన రెండు రహదారులకు మధ్య ఖాళీ స్థలం ఉన్నందున ఈ ప్రాంతం మరింత ప్రమాదకరంగా ఉంది. అధికారులు స్పందించి పాడైన కల్వర్టును బాగు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.



బలిజవాని బ్రిడ్జి పక్కన ఉన్న డైవర్షన్ రోడ్డు



డోల బట్టిపై పాడైన రోడ్డుకు ముందు ఉన్న మలుపు

పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం

- అధిక రేట్లకు ఎరువుల విక్రయం
- ఇసుక దోపిడీకి పాల్పడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు
- సూపర్ సిక్స్ పథకాలు అమలు ఎప్పుడని ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: కూటమి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం వల్ల రాష్ట్రంలోని పేద విద్యార్థులకు వైద్య విద్య అందే అవకాశం లేదని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. కొత్తూరు మండలం గులివిందలపేటలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించాలన్న సంకల్పంతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు మంజూరు చేశారన్నారు. అందులో 5 కాలేజీలను ప్రారంభించి 750 ఎంబీబీఎస్ సీట్లు పేద విద్యార్థులకు కేటాయించారన్నారు. మెడికల్ కాలేజీలను సీఎం చంద్రబాబు ప్రైవేట్ పరం చేసేందుకు చర్యలు తీసుకోవడం తగదన్నారు. రైతులకు ఎరువుల పంపిణీలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతు సేవా కేంద్రాలకు ఎరువులు కేటాయించకుండా ప్రైవేట్ డీలర్లకు అందించి అధిక రేట్లకు విక్రయిస్తున్నారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో యూరియా రూ.278లకు విక్రయిస్తే.. నేడు ప్రైవేట్ డీలర్లు ద్వారా బస్తా రూ.400లకు దాటి విక్రయిస్తున్నారన్నారు. ఉచితం ముసుగులో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఇసుక దోపిడీకి పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడంలో ఎమ్మెల్యే దిట్ట అని విమర్శించారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో కాలయాపన చేస్తున్నారన్నారు. నాలుగు నెలల కూటమి ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజాగ్రహం తప్పదని రెడ్డి శాంతి హెచ్చరించారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యు దు కామక భాగ్యవతి, గ్రామ సచివాలయం మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ వడమ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు నాస బాలకృష్ణ, యర్లంకి ధర్మారావు, నాగేంద్ర, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నిమ్మగడ్డ కృష్ణ, మఠం పూర్ణ, పంకజదాస్, పతివాడ శివాజీ తదితరులు పాల్గొన్నారు

ఐక్యతతోనే సమాజంలో గౌరవం



నర్సింహమూర్తి దంపతులను సన్మానిస్తున్న నగేష్, తదితరులు

ఆమదాలవలస: బ్రాహ్మణుల ఐక్యతతో మెలిగి విలువలు కాపాడుకుంటే సమాజంలో గౌరవం ఉంటుందని బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్మా నగేష్ అన్నారు. ఆమదాలవలస మండల బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పట్టణ పురోహితుడు బలివాడ చిట్టిపంతులు గృహం వద్ద నిర్వహించిన వినాయక నవరాత్రులు ముగింపు కార్యక్రమానికి సోమవారం హాజరయ్యారు. సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ సమాజంలో ఎవరికీ లేని గౌరవం బ్రాహ్మణులకు ఉందని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. ఆమదాలవలస మండల బ్రాహ్మణ సంఘం ఏర్పాటు చేసి నేటికి 37 సంవత్సరాలు పూర్తయిందని, ఎంతో అద్భుతంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారని అభినందించారు. సభ్యులంతా ఐక్యతతో పనిచేసి సంఘాన్ని మరింత బలోపేతం చేసి పేదలకు సహాయం అందించాలని సూచించారు. వేద పండితుడు, విశ్రాంత అధ్యాపకుడు, అధ్యాత్మిక ప్రవచన కర్త నిష్టల నర్సింహమూర్తి దంపతులను ఘనంగా సన్మానం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బి.వి.రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణమూర్తి, కోశాధికారి చిట్టి పంతులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంగింపూడి కాళిదాస్, రిటైర్డ్ తహసీల్దార్ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ మెటీరియల్ పంపిణీ

పాతపట్నం: నిరుద్యోగ అభ్యర్థులు పోటీతత్వం అలవరచుకోవాలని డీఈఓ తిరుమల చైతన్య అన్నారు. స్థానిక కోర్టు కూడలిలో ఉన్న మహేంద్ర జూనియర్ కళాశాలలో మామిడి అప్పారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డీఎస్సీ కోచింగ్ సెంటర్ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ మెటీరియల్‌ను ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో కలిసి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు తమవంతు చేయూత అందజేస్తామన్నారు. ఎంఈఓ శ్రీధర్, విశ్వేశ్వరరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు చక్రపతి, మధుబాబు, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

ఓఎన్‌డీసీలో నమోదు చేయాలి

ఆమదాలవలస: మహిళా సంఘాలు తమ ఆదాయ అభివృద్ధికి చేపడుతున్న ఉత్పత్తుల న్నింటినీ మార్కెటింగ్ చేసుకోవడానికి ప్రభుత్వం నూతనంగా ఓఎన్‌డీసీ (ఆన్‌లైన్ డిజిటల్ కామర్స్) విధానాన్ని అమలులోకి తీసుకువచ్చిందని వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు మండల సమాఖ్య, గ్రామ సంఘాల ద్వారా ఏర్పాటు చేసుకుంటున్న చిన్న, మధ్య తరగతి, కుటీర పరిశ్రమలకు అవసరం మేరకు శ్రీనిధి రుణాలను పొందవచ్చన్నారు. మహిళలు తయారు చేస్తున్న ముఖ్యంగా ఆహార ఉత్పత్తులకు మంచి ప్యాకింగ్, బ్రాండింగ్‌తో మీ సంస్థను మీ లోగోతో సహా రిజిస్ట్రేషన్ చేయించుకుని, ఆన్‌లైన్ మార్కెటింగ్ విధానాన్ని వినియోగించుకోవచ్చన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల సమన్వయకర్త రామప్పడు, ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, క్లస్టర్ కోఆర్డినేటర్లు, వీఓఏలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

ఆమదాలవలస: మండలంలోని కొత్తవలస గ్రామంలో ఉపాధి పథకానికి సంబంధించి సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్ చేసిన పలు అక్రమాలను సభ్యులు వెల్లడించారు. 2021లో మృతి చెందిన ఎలువు పారయ్య పేరుపై మస్తర్లు వేసినట్లు గుర్తించారు. 7 రకాల రికార్డులను నమోదు చేయలేదన్నారు. ఉపాధి పనులకు సంబంధించిన 14 రకాల పత్రాలు లేవన్నారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు చెల్లించినప్పటికీ భవనాలకు రంగులు వేయలేదన్నారు. కొన్ని జాబ్ కార్డుల్లో మస్తర్లు నమోదైనప్పటికీ సంతకాలు వేవన్నారు. మరికొందరు పనులకు రాకపోయినా మస్తర్లు వేసి ఆ మొత్తాలను చెల్లించినట్లు గుర్తించారు. మండలంలోని గాజులకొల్లివలసలో జరిగిన గ్రామ సభలో కూడా ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. 30 పడకల ఆస్పత్రిలో ఉద్యోగికి మస్తరు వేసి వేతనాలు అందించారన్నారు. జాబ్‌కార్డుల కోసం ఫీల్డ్ అసిస్టెంట్ డబ్బులను డిమాండ్ చేశారని గ్రామస్తులు ఫిర్యాదు అందజేసినట్లు అధికారులు తెలిపారు. ఉపాధి హామీ ఏపీఓ లక్ష్మీనరసమ్మ, ఎస్‌టీఎం వై.గౌరీశంకర్, ఎస్‌ఆర్పీ ఎం.తిరుపతిరావు, డీఆర్పీ ఎ.సురేష్, సెక్రటరీ పి.రాము పాల్గొన్నారు.

గ్రంథాలయం ఏర్పాటుకు కృషి

ఎల్.ఎన్.పేట: మండలంలో శాఖా గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని డొంకలబడవంజ గ్రామానికి చెందిన ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు పెద్దకోట వెంకటరావు అన్నారు. ఇందులో భాగంగా సోమవారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిసి గ్రంథాలయం ఏర్పాటు ఆవశ్యకతను తెలియజేస్తూ వినతిపత్రాన్ని అందజేశామన్నారు. మండలం ఏర్పడి 25 ఏళ్లు పూర్తికావస్తున్నప్పటికీ ప్రభుత్వ గ్రంథాలయం లేకపోవటం వల్ల పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర మంత్రికి వివరించామన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ



ఎల్.ఎన్.పేట: ముంగెన్నపాడు సర్పంచ్ గణపతి కుటుంబాన్ని పరామర్శిస్తున్న రెడ్డి శాంతి, నాయకులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు కుటుంబాలను పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం పరామర్శించారు. ముంగెన్నపాడు సర్పంచ్ యారబాటి గణపతి తండ్రి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రెడ్డి శాంతి సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించారు. మల్లికార్జునపురం వద్ద పాన్‌షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న హనుమంతు శ్రీకాంత్ కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల వర్షాలు కారణంగా షాపుపై చెట్టుపడి వారికి ఆర్థికంగా నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వపరంగా ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన మండల కో ఆప్షన్ సభ్యుడు రామ్‌నాథ్ మహాపాత్రో సోదరుడు ఇటీవల మృతి చెందారు. రామ్‌నాథ్ కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ రెడ్డి జ్యోతి లక్ష్మి, జెడ్పీటీసీ కిలారి త్రినాథులు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, వైఎస్సార్‌సీపీ మండల ప్రెసిడెంట్ పెనుమజ్జి విష్ణుమూర్తి, శిమ్మ సాంబశివరావు, రెడ్డి సీతారాం, ముగడ జనార్దన, లోచర్ల మల్లేశ్వరరావు, లుకలాపు సుధీర్ తదితరులు ఉన్నారు.

హిరమండలం: మండలంలోని రుగడ ఎంపీటీసీ సభ్యులరాలు కరణం ప్రియాంక తండ్రి గోవిందరావు ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం అవలంగి గ్రామానికి వెళ్లి గోవిందరావు కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లోలుగు లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల వెంకట రామకృష్ణ, సర్పంచ్ పి.పావని, నాయకులు చక్క బాలకృష్ణ, చీమల గణపతి ఉన్నారు.

కొత్తూరు: మండలంలోని రాయల మాజీ సర్పంచ్ సొంట్యాన జనార్దనరావు భార్య మల్లేశ్వరి, కడుములో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బూరాడ తవిటినాయుడు కుమార్తె లక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పరామర్శించారు.

ఎన్.ఎన్.కాలనీలో వైఎస్సార్‌సీపీ నేత టొంపల గోపాల్, గూనభద్రలో వైఎస్సార్‌సీపీ నేత అంపిలి బుచ్చిబాబు భార్య, గులివిందలపేటలో పార్టీ నాయకుడు చింతాడ నారాయణరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. వీరిని పరామర్శించారు. జెడ్పీటీసీ మాజీ చైర్మన్ కామక భాగ్యవతి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ వడమ శ్రీనివాసరావు, గండివలస ఆనందరావు, పార్టీ నేతలు లోతుగెడ్డ తిరుపతిరావు, గండివలస ఆనందరావు, కె.వైకుంఠరావు, పెదకోట సాధుబాబు, యర్లంకి ధర్మారావు, మఠం పూర్ణ, పంకజ దాస్, వనుము లక్ష్మీనారాయణ, నిమ్మగడ్డ కృష్ణ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు



మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెంలో ఉన్న మసీద్‌లో మహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని మిలాద్-ఉన్-నబీ వేడుకలను భక్తిశ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మసీద్ గురువు మహమ్మద్ లుక్‌మాన్, మత పెద్దలు ప్రవక్త బోధనలను వివరించారు. శాంతి, ధర్మం, సమానత్వం, తోటి వారితో ఎలా మెలగాలో వివరించారు. రామరాజు, షేక్ షాంద్, ఫరీద్, ఫకీర్, హిబ్రహిమ్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక లడ్డూ @ రూ.70 వేలు



మెళియాపుట్టి: లడ్డూ ప్రసాదంతో ఖగేశ్వరరావు కుటుంబ సభ్యులు

మెళియాపుట్టి: మండలంలోని శేఖరాపురం గ్రామంలో వినాయకుని లడ్డూ వేలం పాట సోమవారం నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న వినాయకుని లడ్డూను గ్రామానికి చెందిన బొంగర్ల ఖగేశ్వరరావు రూ.70 వేలకు సొంతం చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వినాయకుని లడ్డూ ప్రసాదం అత్యధిక ధర పలకడం మునుపెన్నడూ చూడలేదని గ్రామస్తులు తెలిపారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ లడ్డూ సొమ్ముతో వచ్చే సంవత్సరం మరింత ఘనంగా వినాయక పూజలు నిర్వహిస్తామన్నారు.

పురుషోత్తపురంలో..

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం పెద్ద వీధి యూత్ ఆధ్వర్యంలో సోమవారం వినాయక లడ్డూను వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో కొత్తకోట గోవిందరావు స్వామివారి లడ్డూను రూ.3,900 లకు దక్కించుకున్నాడు. ఈ వేలంపాటలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: వినాయక నవరాత్రులు ముగియడంతో విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు. మండల పరిధిలో సోమవారం పెద్ద ఎత్తున విగ్రహాలను సమీప గెడ్డల్లో, నదిలో, చెరువుల్లో నిమజ్జనం చేశారు. నరసన్నపేటలోని కొత్తవీధిలో జరిగిన నిమజ్జనంలో సినీ నటుడు ప్రభాస్ శ్రీను పాల్గొన్నారు. మండపాల వద్ద ఉంచిన లడ్డూల వేలం కార్యక్రమాలు సందడిగా చేపట్టారు. కొత్త వీధి వద్ద లడ్డూ వేలం రూ.50,001లకు నాయుడు గణేష్ దక్కించుకున్నారు. చిక్కాలవలసలో లడ్డూను పండూరి చిన్నికృష్ణ రూ. 21.500లకు పాడారు.



నరసన్నపేట: కొత్తవీది లడ్డూను దక్కించుకున్న నాయుడు గణేష్



నరసన్నపేట: చిక్కాలవలసలో గణపతి లడ్డూతో చిన్నికృష్ణ కుటుంబ సభ్యులు

గంగమ్మ ఒడిలోకి గణనాథుడు



హిరమండలం: వినాయక విగ్రహాన్ని వంశధార కాలువలో నిమజ్జనం చేస్తున్న దృశ్యం



ఆమదాలవలస: చింతాడ గ్రామంలో ఆకట్టుకున్న వేషధారణలు

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలంలోని సత్యసాయి సేవాసమితి ఏర్పాటుచేసిన వినాయక విగ్రహ నిమజ్జనం సోమవారం సందడిగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు వివిధ రకాల పూజా కార్యక్రమాలు చేపట్టారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఊరేగింపుగా తీసుకువెళ్లి వంశధార కు డిప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు.

ఆకట్టుకున్న వేషధారణలు

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి 7వ వార్డు చింతాడలో వైఎస్సార్‌సీపీ నాయకులు బోర రమణయ్య ఆధ్వర్యంలో కోదండరామస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలు ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన యువకులు, చిన్నారులు శివుడు, పార్వతి, సీతారాములు, ఆంజనేయుడు, వివిధ వేషధారణలు వేసి గణేష్ విగ్రహాన్ని ఊరేగించారు.